# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నుంచి 4 రోజుల పాటు లండన్‌లో పర్యటించనున్నారు.**

2. **రాష్ట్రంలో రేపటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.**

3. **తుఫాన్ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **ఐ.సి.సి. మహిళల వన్డే క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ నవీ ముంబయి వేదికగా ఈ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది.**

========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నుంచి 4 రోజుల పాటు లండన్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 14, 15వ తేదీల్లో రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహించనున్న భాగసామ్య సదస్సుకు పెట్టుబడిదారులను ఆహ్వానించనున్నట్లు అధికారులు వెల్లడించారు. లండన్‌లో ముఖ్యమంత్రి పలువురు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశం కానున్నారని తెలిపారు. సిఐఐ నిర్వహించే రోడ్ షోలోను ముఖ్యమంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

-------------------------

ఉత్తమ పార్లమెంటేరియన్ గా ఎర్రన్నాయుడు తనదైన ముద్ర వేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. ఉన్నత విలువలకు ప్రతిరూపంగా మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు నిలిచారని కొనియాడారు. మరో వైపు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే. రామ్మోహన్ నాయుడు ఎర్రన్నాయుడు ఘాటు వద్ద ఆయనకు నివాళులర్పించారు.

-------------------------

రాష్ట్రంలో రేపటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం 51 లక్షల టన్నుల

ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల 13 రైతు సేవా కేంద్రాలు, 2 వేల 61 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి "7337359375" వాట్సాప్ నంబర్‌కు "హాయ్" అనే సందేశం పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా రేపు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారు.

--------------------------

భారీ వర్షాల సమయంలో నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఉండేందుకు 50 కోట్ల రూపాయలతో కాలువలను ఆధునికీకరిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని సింహపురి కాలనీలో ఆయన నిన్న రాత్రి పర్యటించారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... నెల్లూరు నగరాన్ని దోమల రహితంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కాలువల ఆధునికీకరణకు సంబంధించి టెండర్లు ఆహ్వానించినట్లు వివరించారు.

--------------------------

అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ తెలిపారు. విజయవాడలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ఆయన జెండా ఊపి ఈరోజు ప్రారంభించారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణలో భాగంగా సమగ్రత, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి రహితంగా ప్రజాసేవ భావంతో తమ విధులను నిర్వహించాలని అతుల్ సింగ్ పేర్కొంటూ..

వాయిస్.. 26 సెకన్లు

--------------------------

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ దేశంలోనే అత్యంత బరువైన ఉపగ్రహం సిఎంఎస్-03 కమ్యూనికేషన్స్ శాటిలైట్‌ను ఈరోజు సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు నింగిలోకి పంపనుంది. సుమారు నాలుగు వేల 4 వందల 10 కిలోల బరువు ఉన్న ఈ ఉపగ్రహాన్ని బాహుబలి రాకెట్‌గా నామకరణం చేశారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ప్రయోగం ప్రారంభమైన 16.09 నిమిషాల తర్వాత ఉపగ్రహం కక్ష్యలోకి ప్రవేశించనుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.

--------------------------

తుఫాన్ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వీవర్స్ కాలనీలో చేనేత కుటుంబాలకు చెందిన 490 మందికి తుఫాన్ అత్యవసర సాయంగా నిత్యావసర సరకులను ఆయన నిన్న రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 34 సెకన్లు

-------------------------

ఆయుష్ విభాగంలో 107 ఖాళీల భర్తీకి ఆంధ్రప్రదేశ్ వైద్యసేవల నియామక బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒప్పంద పద్ధతిలో స్టేట్ ప్రోగ్రాం అధికారి, ఫైనాన్స్ మేనేజర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున, జిల్లా ప్రోగ్రాం అధికారి పోస్టులు 26, సైకియాట్రిస్ట్ పోస్టులు 3, ఆయుర్వేద వైద్య పోస్టులు 51, హోమియోపతి వైద్య పోస్టులు 15, యునానీ వైద్య పోస్టులు 6 భర్తీ చేయనున్నారు. పొరుగు సేవల కింద నాలుగు యోగా ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులు భర్తీ చేస్తారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఎస్ఆర్‌బీ మెంబర్ సెక్రటరీ ఎం.వి.సూర్యకళ తెలిపారు.

-------------------------

ఐ.సి.సి. మహిళల వన్డే క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ నవీ ముంబయి వేదికగా ఈ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. ఫైనల్స్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడుతున్నాయి. వన్డే ప్రపంచకప్‌లో భారత్ మూడోసారి  ఫైనల్ చేరగా.. దక్షిణాఫ్రికా ఫైనల్స్‌కు రావడం ఇదే తొలిసారి.

కాగా విజయవాడలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేశారు. నగరంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ మ్యాచ్‌ను లైవ్‌లో వీక్షించేందుకు భారీ ఎల్. ఇ. డి. స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

====================